క్లుప్తంగా

కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఇస్తున్న కుట్టు శిక్షణను మహిళలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఉన్నత పాఠశాలలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా సమ కూర్చిన కుట్టు శిక్షణ ద్వారా కుట్టుమూర్తులు తయారు చేయడం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందడానికి చక్కటి అవకాశమన్నారు. కుట్టు శిక్షణ బ్యాచ్‌ల వారీగా 90 మందికి 90 రోజులు వివిధ రకాల కుట్టు మూర్తుల తయారీకి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో శిక్షకులు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్ విధానంతో బహుళ ప్రయోజనాలు



డ్రమ్‌సీడర్ ద్వారా వరినాట్లు వేయిస్తున్న ఏఓ ఎస్.అవినాష్


సీతానగరం: ఖరీఫ్ వరి వేయాల్సిన రైతులకు డ్రమ్ సీడర్ విధానంతో బహుళ ప్రయోజనాలున్నాయని ఎంఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని లచ్చయ్యపేట పొలంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వరిసాగులో డ్రమ్‌సీడర్‌తో మొలకెత్తిన వరి విత్తనాలను నేరుగా మాగాణి భూమిలో నాటడానికి అవసరమైన మెలకువలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారు పోయడం, నాట్లు వేయడం వంటి సంప్రదాయ పద్ధతులకు ప్రత్యామ్నాయంగా డ్రమ్‌సీడర్ విధానం ఉపయోగపడుతుందన్నారు. డ్రమ్ సీడర్ విధానం వలన నీరు ఆదా చేయగలగడమే కాకుండా సమయం కూడా ఆదాఅవుతుందని స్పష్టం చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తులకు జరిమానా

మక్కువ: మండలంలో ఇటీవల పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వాహనదారులకు బుధవారం సాలూరు మెజిస్ట్రేట్ రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై వెంకటరమణమూర్తి తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తులను మెజిస్ట్రేట్ మందలించినట్లు తెలిపారు. తొలిసారి పట్టుబడిన వ్యక్తులు రెండవసారి మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే, డ్రైవింగ్ లైసెన్స్ రద్దుతోపాటు, జైలుశిక్ష పడే అవకాశముంటుందని హెచ్చరించారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే, చట్టపరంగా కఠినచర్యలు తప్పవని ఎస్సై స్పష్టం చేశారు.

మహిళలకు భద్రత కల్పించడమే లక్ష్యం

- ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

పార్వతీపురం: మహిళలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా వన్‌స్టాప్ సెంటర్ పనిచేస్తుందని జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకదుర్గ అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో ఉన్న వన్‌స్టాప్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వన్ స్టాప్ కేంద్రానికి వచ్చిన బాధితులతో మాట్లాడి వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కౌన్సిలర్‌లకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రైవేట్, పబ్లిక్ ప్రదేశాల్లో, కుటుంబాలు, సమాజం, పని ప్రదేశంలో హింసకు గురైన మహిళలకు మద్దతు ఇవ్వడానికి వన్‌స్టాప్ కేంద్రం ఉద్దేశించినట్లు చెప్పారు. కులం, వయస్సు, జాతి, సంస్కృతి సంబంధం లేకుండా శారీరక, మానసిక, లైంగిక, భావోద్వేగ, ఆర్థిక వేధింపులను ఎదుర్కొంటున్న మహిళల సమస్యల పరిష్కారానికి ఈ కేంద్రంలో పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్రం అడ్మినిస్ట్రేటర్ జి.శాంతికుమారి, కౌన్సిలర్ పల్లవి, సిబ్బంది భారతి, గౌరి, నారాయణ తదితరులున్నారు.

గుచ్చిమి వెటర్నరీ అసిస్టెంట్ మృతి

సీతానగరం: మండలంలోని గుచ్చిమి సచివాలయంలో విధులు నిర్వహించిన వెటర్నరీ అసిస్టెంట్ డి.విజయ కుమారి మృతి తీరని లోటని పశుసంవర్థక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు అన్నారు. మండలకేంద్రంలోని పశువైద్య కేంద్రంలో బుధవారం వారు మాట్లాడుతూ 2020లో గుచ్చిమి పశుసంవర్థక శాఖ సహాయకురాలిగా విజయకుమారి నియమితులై నాటినుంచి నేటివరకూ సకాలంలో విధులు నిర్వహించి పాడిరైతుల మన్ననలు పొందారన్నారు. మంచి ఉద్యోగిని కోల్పోయామన్నారు. ఆమె మృతి పట్ల పశువైద్యాధికారులు, సిబ్బంది ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

అన్నదాత అంటే అలుసా..?

- ఇంకెన్నాళ్లీ ఎదురుచూపులు
- మండిపడుతున్న రైతులు
- ఇంకా అందని అన్నదాత సుఖీభవ సాయం



దుక్కి దున్నుతున్న రైతులు



మండలంలో సాగు విస్తీర్ణం	21వేల ఎకరాలు
ఆయకట్టు సుమారు	11వేల ఎకరాలు
వర్షాధారం	10వేల ఎకరాలు
రైతులు	10 వేలమంది ఉంటారు



సాగుకు సిద్ధం చేసిన భూములు

బలిజిపేట:

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు సాగుకు సిద్ధం చేస్తున్నారు. విత్తనాల కొనుగోలు, దుక్కులకు మదుపులు, నారుపోత, ఎరువులకు సిద్ధమవుతున్నారు. ఈ సారైనా ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుందా అని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే రైతులు వెదపంట వేశారు. ఊభాలు జరపాలనుకున్న రైతులు విత్తనాలను చల్లి నారుకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రైతులు బోర్లకింద ఖరీఫ్ పంటలు పండించేందుకు సిద్ధమయ్యారు. వర్షాధారంపై వ్యవసాయం చేసేవారు అదును చూసి అన్ని పనులు ఒక్కసారి చేయాల్సి రావడంతో ఆర్థిక భారం ఒక్కసారిగా వారిపై పడుతోంది. అటువంటి వారికి ఎంతో ఇబ్బందికరంగా ఉంటోంది. ఒక్కసారిగా అన్నీ సిద్ధం చేసేందుకు అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వం పెట్టిన రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్పుచేసిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం పూర్తయినా నేటికీ అమలు చేయలేదని తక్షణమే అమలుచేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో సీజన్ ఆరంభంలోనే..

రైతులు పంటల సాగుకోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం(వైఎస్సార్ రైతు భరోసా) అందిస్తూ రైతులకు అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందిస్తూ వచ్చింది. పీఎం కిసాన్ సాయం కింద రూ.6వేలు, వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.7,500 కలిపి మొత్తం రూ.13,500రైతుల ఖాతాలకు జమ చేసేది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతుల ఖాతాలకు జమ చేసేది. ఇలా 5సంవత్సరాల పాటు రైతులకు ఆర్థిక సాయం అందించింది.

కౌలు రైతులకూ..

భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులతో పాటు అటవీ, దేవదాయ భూములను సాగుచేస్తున్న కౌలు రైతులకు కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందించింది.

రాష్ట్రసాయం కోసం ఎదురుచూపు

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో దుక్కులు దున్నడం, విత్తనాలు కొనుగోలు, నారుమడుల తయారీకి రైతులకు సొమ్ములు అవసరమవుతున్నాయి. కేంద్రం సీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.2వేల నగదు చాలదని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామని కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తయినా నేటికీ రైతులకు ఎటువంటి ఆర్థికసా యం అంద లేదని, అంతా ప్రకటనలకే పరిమితమైందని రైతులు ఆవేదన చెందు తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయం ఏవిధంగా చేయగలమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

ఎన్నికల హామీని నెరవేర్చాలి

గత ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20వేలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలి. ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడులకు అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నాం. ఎంతో కష్టంగా ఉంటోంది. వెంటనే ఆర్థిక సాయం అందించాలి.

–సింహాచలం నాయుడు, రైతు, బలిజిపేట

జగన్‌మోహన్ రెడ్డితో సమావేశమైన రాజన్నదొర, జోగారావు



సమావేశంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సాలూరు: వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావులు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డితో తాడేపల్లిలో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని అన్ని నియోజవకర్గాల ఇన్‌చార్జిలు, ఎంపీపీలు, పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సమావేశం నిర్వహించి తాజా పరిస్థితులపై చర్చించి పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

మక్కువ మండలం వైఎస్సార్‌సీపీ నియామకాలు

మక్కువ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మక్కువ మండలానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆ వివరాలిలి ఉన్నాయి.

మహిళా విభాగ కమిటీ

ప్రెసిడెంట్‌గా కోట్ల నారాయణమ్మ, వైస్ ప్రెసిడెంట్లుగా బొత్స జయలక్ష్మి, మావుడి రమాదేవి, జనరల్ సెక్రటరీలుగా బొంగు రాజేశ్వరి, సీదరపు లక్ష్మి, గేదెల రాధిక, సెక్రటరీలుగా బలగ సావిత్రమ్మ, అలమండ సుధ, బొత్స మహాలక్ష్మి, పోల ఉమామహేశ్వరి, ఒంటి రామలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మెల్లిక రాములమ్మ, సీదరపు గంగమ్మ, పూడి రమణమ్మ, తెర్లి మోహిని, మరడ వెంకటరత్నం, మండంగి భాగ్యలక్ష్మి, చప్ప అన్నపూర్ణ, గూనాన అర్జునమ్మ, మర్రి పారమ్మ, సిరికి సింహాచలమమ్మ, కొమ్ము గంగమ్మ, వెదుళ్ల సింహాచలం నియమితులయ్యారు.

రైతు విభాగ కమిటీ

ప్రెసిడెంట్‌గా కోట్ల నారాయణరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా చప్ప సూర్యనారాయణ, బలగ మధుసూదనరావు, జనరల్ సెక్రటరీలుగా అల్లు తిరుపతిరావు, అన్ను సింహాచలం, పెంట కిశోర్, సెక్రటరీలుగా అమరాపు ముత్యాలు, పెంట కుమార్, ఏగిరెడ్డి తిరుమల, అల్లు అచ్చుతరావు, యాకల శ్రీను, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బొంగు మోహన్, చప్ప రామకృష్ణ, రౌతు వెంకటనాయుడు, వేమల అప్పలనాయుడు, తలుపుల రాము, మేళాపు లక్ష్మణ, అల్లు సూర్యనారాయణ, బడే సింహాచలం, దొడ్డి తిరుపతి, గేదెల సింహాచలం, బలగ ఈశ్వరరావు, చప్ప రాము నియామకమయ్యారు.

ఎస్సీ విభాగ కమిటీ

ప్రెసిడెంట్‌గా అలమండ మధుసూదనరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా జుమ్ము సింహాచలం, వెలగాడ వెంకటలక్ష్మి, జనరల్ సెక్రటరీలుగా సొండి కల్యాణి, సింగనాపురం తిరుపతి, వెలగాడ పైడితల్లి, సెక్రటరీలుగా అలమండ రవి, యర్రారపు అనంత్, రామవరపు కుమార్, బాక కళావతి, అలమండ జ్యోతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గొండెల బాబూరావు, జుమ్మ శృతి, గూనాన అప్పారావు, గొండెల రవి, సొండి వరం, బంగారు సుధీర్, సొండి శ్రీను, సొండి అశ్విని, సురాపాటి చంద్రరావు, అలమండ అశోక్‌కుమార్, యామల కృష్ణ, గంట సత్యం నియమితులయ్యారు.

సోషల్ మీడియా విభాగ కమిటీ

ప్రెసిడెంట్‌గా శంబంగి భానుప్రసాద్, వైస్‌ప్రెసిడెంట్లుగా పూడి కృష్ణచైతన్య, గన్ను భానుచంద్ర, జనరల్ సెక్రటరీలుగా రౌతు భూషణరావు, బొత్స అఖిల్, కొట్నాన ధనుంజయరావు, సెక్రటరీలుగా కొయ్యాన దుర్గాప్రసాద్, కురిమేన చంటిని నియమించారు.

ఎస్టీ విభాగ కమిటీ

ప్రెసిడెంట్‌గా సీదరపు మోహన్, వైస్‌ప్రెసిడెంట్‌లుగా సీదరపు నాగేశ్వరరావు, పూజారి గంగరాజు, జనరల్ సెక్రటరీలుగా మువ్వల సురేష్, గమ్మెల తిరుపతి, మెండంగి నల్లమ్మ, సెక్రటరీలుగా కొండతామర ఉత్తర, సీదరపు పాపారావు, సీదరపు గంగమ్మ, కునేటి కాంతమ్మ, కొండగొర్రి సంజీవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా తాడంగి లక్ష్మి, యడ్ల శంకర్రావు, గమ్మెల అప్పలస్వామి, వాటిక సత్యనారాయణ, చీపురు ఈశ్వరరావు, యడ్ల జయమ్మ, సాగారపు సీత, యడ్ల సంతు, దండి నరేష్, మర్రి తౌడు, సీదరపు లక్ష్మిలు నియమితులయ్యారు.

వరి నారుమడి యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో భారతి

మక్కువ: వరి నారుమడి యాజమాన్య పద్ధతిపై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయాధికారిణి చింతల భారతి కోరారు. ఈ మేరకు మండలంలోని పనసభద్ర గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ఆసన్నమైనందున రైతులకు మేలైన వ్యవసాయం, శాస్త్రీయ మెలకువలు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వరి సాగుచేసే రైతులు వెదసాగుచేసుకుంటే, పంటకయ్యే ఖర్చు తగ్గడంతోపాటు, దిగుబడి పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతిరైతు పాటించి, పంటలు సాగు చేసుకుంటే ఆరోగ్యవం తమైన పంటలు పండించుకోవచ్చని చెప్పారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న నవధాన్యాల పంటను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు జె.చంద్రశేఖర్, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ ఉర్లక నాగార్జున, ఐసీఆర్‌పీలు సుందరరావు, వెంకటర్రావు, అప్పలరాజు, రైతులు పాల్గొన్నారు.

మాన్యువల్ వన్‌బీ అయినా అందించాలి



వన్‌బీలు అందించాలని కోరుతున్న శాంతేశ్వరం గ్రామ రైతులు

మక్కువ: మండలంలోని శాంతేశ్వరం గ్రామానికి చెందిన రైతులు మాన్యువల్ వన్‌బీలు అయినా అందించాలని కోరుతున్నారు. గ్రామంలో ల్యాండ్ సర్వేను గతంలో అధికారులు జరిపించారని, దీంతో వన్‌బీలు రావడం లేదని గ్రామానికి చెందిన రైతులు యాండ్రాపు గోపాలకృష్ణ, సన్యాసినాయుడులు బుధవారం విలేకరుల ముందు వాపోయారు. రెవెన్యూ అధికారులు మాన్యువల్ వన్‌బీలు అయినా అందించాలని, గతేడాది నుంచి కోరుతున్నప్పటికీ, పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. పలు బ్యాంక్‌లలో క్రాప్‌లోన్‌ను గ్రామానికి చెందిన పలువురు రైతులు తీసుకున్నా రని, తీసుకున్న రుణాలను బ్యాంక్‌లలో రెన్యువల్ చేసేందుకు సైతం వన్‌బీలు అవసరమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మాన్యువల్ వన్‌బీలైన అందించాలని కోరుతున్నారు.

యంత్ర పరికరాలతో కలుపు నివారణ



పవర్‌వీడర్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో తిరుపతిరావు


పాచిపెంట: పంటల్లో కలుపు నివారణకు మందులు వాడే కంటే యంత్రపరికరాలతో నియంత్రించడం ఉత్తమమని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని రాయిగుడ్డి వలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవర్ వీడర్ ఉపయోగాలను రైతులకు వివరిస్తూ పత్తి రైతు తప్పనిసరిగా పవర్ వీడర్ కొనుగోలు చేసుకోవాలని, పత్తి, మొక్కజొన్న వంటి పంటల మధ్య కలుపు నివారణకు ఎంతో దోహదపడుతుందన్నారు. కలుపు నివారణకు రసాయనాలు అధికంగా వాడడం వల్ల భూసారం దెబ్బతింటుందని హెచ్చరించారు. సమీపంలో ఉన్న నీటి కుంటలను కలుషితం చేస్తాయని యంత్ర సహాయంతో దుక్కి దున్నడం వల్ల కలుపు నశించడమే కాకుండా మళ్లీ ఎరువుగా మారుతుందని అలాగే భూమిలో సేంద్రియ పదార్థం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ఎంపీడీవో జగన్నాథ పాత్రో చేతుల మీదుగా కంది విత్తనాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు సాయిగణేష్ ప్రకృతి సేద్యం ప్రతినిధులు సూర్యారావు, సుకరమ్మ, గ్రామ పెద్దలు కంఠందొర, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

డీఎల్‌పీఓ నాగభూషణరావు

పాచిపెంట: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎల్‌పీఓ ఎం.నాగభూషణరావు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం పాచిపెంట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ముందుగా ఇంటి పన్నుల వసూళ్లు, పంచాయతీ నిధుల వినియోగం ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ కార్యదర్శులకు తగు సూచనలు సలహాలు అందించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు

బలిజిపేట: 2024–25 విద్యాసంవత్సరంలో బలిజిపేట ఉన్నత పాఠశాలలో చదివి పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీ సీట్లు పొందిన విద్యార్థులు జి.గాయత్రి, యు.ప్రియాంకలను ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటనాయుడు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. గాయత్రికి ఇడుపులపాయలో, ప్రియాంకకు శ్రీకాకుళంలో సీట్లు రావడం ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నతమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని అందుకు ఉపాధ్యాయుల సహకారం ఎల్లవేళలా అందిస్తామని తెలిపారు. అలాగే పెదపెంకి ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులు కోట సందీప్, జె.నరేష్, ఒప్పంగి గణేష్‌లను నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు అభినందించి వారికి ఒక్కొక్కరికి రూ.500వంతున బహుమతిగా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి కక్ష సాధింపు మానుకోవాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు



వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

పార్వతీపురం రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. వ్యక్తిగత బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడాన్ని అయన తీవ్రంగా ఖండించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా అయన కోసం వచ్చే ప్రజాదరణను చూసి ఓర్వలేక, ప్రజల మధ్యకు వెళ్లకుండా బుల్లెట్ ప్రూఫ్ వాహనం స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం కుట్ర బయటపడిందని, ప్రజలు గమనిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాది పాలనలో వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బెదిరింపులు, దౌర్జన్యాలపై పెట్టిన దృష్టి, పాలనపై పెట్టి ఉంటే బాగుండేదని. ఒక మాజీ సీఎం బుల్లెట్ ప్రూఫ్ కారు స్వాధీనం చేసుకోవడం ముమ్మాటికి తప్పేనని, ఇప్పటికైనా చంద్రబాబునాయుడు కుట్రలు కుతంత్రాలు మానుకుని పాలనపై దృష్టి పెట్టాలన్నారు.

రేషన్ సరుకులు గడువులోగా పంపిణీ చేయాలి

సీతానగరం: మండలంలో రైస్‌కార్డులున్న వారికి నిర్దేశించిన సమయానికి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని, వినియోగదారులకు డీలర్లు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సివిల్‌సప్లైస్ డీటీ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో డీలర్లతో బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ పంపిణీ వాహనాలను రద్దు చేయడం వల్ల 65 సంవత్సరాల పైబడి రేషన్‌కార్డులున్న వినియోగదారులకు 26 నుంచి ఇంటింటికీ రేషన్‌సరుకులను డీలర్లు పంపిణీ చేయాలని కోరారు. డీలర్లు పంపిణీ చేయాలని చెప్పారు. అలాగే గ్రామాల్లో నిబంధనలకు లోబడి వినియోగ దారులకు ప్రభుత్వం సమకూర్చిన సరుకులు పంచదార, బియ్యం పంపిణీ చేయడానికి సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్. శ్రీనివాసరావు, సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

పాచిపెంట మండల వైఎస్సార్‌సీపీ కమిటీల ఏర్పాటు

పాచిపెంట: మండలంలోని వివిధ విభాగాలకు కమిటీలను ఏర్పాటు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు యువజన విభాగానికి నారాయణరావు, వాణిజ్య విభాగానికి ఉప్పల నరసరాజు, వలంటీర్ విభాగానికి తట్టికాయల జయప్రకాష్, రైతు విభాగానికి పాచిపెంట సూర్యనారాయణ, దివ్యాంగుల విభాగం ఉత్తరావిల్లి కొండలరావు, బీసీసెల్ ఇజ్జాడ అప్పలనాయుడు, మైనార్టీ సెల్ షేక్ అబ్దుల్ ఇసాక్(బకారి), పద్మశాలీ సంఘం బెండపూడి అప్పారావు, సాంస్కృతిక విభాగం మీసాల ఆదినారాయణ, మహిళా విభాగం బడ్నాన ప్రమీల, పంచాయతీరాజ్ విభాగం బోను మురళి, ప్రచార విభాగం దండి ఏడుకొండలు, ఆర్టీఐ విభాగం మాదల సింహాచలం, ఎస్సీ సెల్ పిట్ల పాపారావు, సోషల్ మీడియా ఆర్నిం రమేష్, ఎస్టీ సెల్ చెల్లూరు సీతారాం, విద్యార్థి విభాగం పోరాపు ఈశ్వరరావులను.. ఆయా విభాగాలకు అధ్యక్షులుగా నియమించారు. వారితో పాటు ఒక్కో విభాగానికి ఇద్దరు ఉపాధ్యక్షులు జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు మరి కొంతమంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేస్తూ జాబితా విడుదల చేశారు.

డీఏ జుగాకు దరఖాస్తుల స్వీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గొరజాన రమేష్

పార్వతీపురం రూరల్: మండలంలోని ములగ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మడక కృష్ణవేణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పంచాయతీ పరిధిలో ఉన్న ఏడు గ్రామాలకు చెందిన గిరిజనుల నుంచి డీఏ జుగా పథకానికి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పార్వతీపురం ఎంపీడీఓ గొరజాన రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీఏజుగా 11 ద్వారా వెనుకబడిన గిరిజనులకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వెలగవలస సర్పంచ్ మెల్లి దాలమ్మ, మండల వ్యవసాయ శాఖ అధికారి అశోక్, వెలుగు ఏపీఎం సన్నిబాబు హౌసింగ్ ఏఈ చిరంజీవి, కార్యదర్శులు భార్గవ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పార్వతీపురం రూరల్: అగ్నిమాపక శాఖ పార్వతీపురం సిబ్బంది జిల్లా కేంద్రంలోని సాఫ్ట్ ప్రో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న మహిళలకు అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రధానంగా ఏ విధంగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయో, వాటికి గల కారణాలు అవి జరగకుండా నివారించేందుకు తీసుకోవలసిన చర్యలపై మహిళలకు తెలియజేశారు. వంటగ్యాస్ ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలు, బహుళ అంతస్తులు, నివాసాలు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు జి.ప్రభాకర్‌రావు, దళపతి రమేష్, మేనేజర్ ఎ.రాజేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నిరోధిద్దాం



బలిజిపేట: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



పాచిపెంట: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీసీపీఓ అల్లు సత్యనారాయణ

బలిజిపేట: మాదక ద్రవ్యాలను నిరోధించాలని, వాటివల్ల సమాజం భ్రష్టు పట్టిపోతోందని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీఓ రాజ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నషాముక్త్ భారత్ అభియాన్ కింద అవగాహన కార్యక్రమాన్ని బలిజిపేట ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకులు మాదకద్రవ్యాలను అలవాటు చేసుకుని వారి జీవితాలు పాడుచేసుకోవద్దని హితవు పలికారు. యువత భావిభారత పౌరులని, సమాజంపై వారికి ఎంతో బాధ్యత ఉండాలని, సమాజశ్రేయస్సు, అభివృద్ధిపై దృష్టిసారించాలి తప్ప మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు బానిసలుగా మారకూడదన్నారు. మాదకద్రవ్య సమాజంగా మార్చేందుకు అందరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ అధికారి పి.శ్రీధర్, సూపర్‌వైజర్లు బి.పద్మావతి, ఎస్.సులేఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి హరికృష్ణ, మహిళా సంరక్షణ అధికారులు సంధ్యారాణి, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పాచిపెంట: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీసీపీఓ అల్లు సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పి.కోనవలస గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మాదకద్రవ్యాల వినియోగం రోజురోజుకూ పెరిగిపోతోందని దీనివల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. మాదకద్రవ్యాల వినియోగానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని కోరారు. ఐసీడీఎస్ పీఓ బొత్స అనంతలక్ష్మి మాట్లాడుతూ చిన్నవయసులో మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యం దెబ్బతింటుందని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.